

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 ఫిబ్రవరి, 2014 సంచిక : 9

(విజయ నామ సం॥, ఫాల్గుణ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**శ్రీ ఆర్. వెంకట శివప్రసాద్**

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి ......... | రూ॥ | 8/- |
| వార్షిక చందా ......... | రూ॥ | 80/- |
| ఆజీవన సభ్యత్వం ......... | రూ॥ | 800/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2

ఇదీ గడిచిపోతుంది ........ 5

శ్రీ సాయి-సేవ ........ 9

షిరిడీ డైరీ ........ 13

సాయితో తర్ఖడ్ స్మృతులు ........ 15

అనాదిగా యీ గడ్డపైని బోధలు 18

శ్రీ గజానన విజయం ........ 19

సన్న్యాసం-సజీవ విశ్వాసం ........ 21

అసలు కథ ........ 24

మాతృసంస్థ కబుర్లు ........ 26

ఆధ్యాత్మిక సాధకులకు ........ 32







# మా వాణి



*ఫిబ్రవరి నెల 27వ తేదీన రానున్న మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పాఠకమిత్రులందరికీ శుభాకాంక్షలు.*

పరమశివుడు పృథ్వీతలంపై అవతరించిన లేదా ప్రకటించుకొన్న రోజు మహాశివరాత్రి. ఆ రోజు అర్ధరాత్రివేళ శివుడు లింగాకృతిలో ఆవిర్భవించాడని అంటారు, శ్రీ మహావిష్ణువు బ్రహ్మదేవుడు స్థంభాకృతిలో ఉన్న ఈ జ్యోతిర్మయ స్వరూపం ఏమిటో! అని- ఆశ్చర్యపడి దాని ఆద్యంతాలు కనుక్కోవాలనుకున్నారట. విష్ణువు భూమిని తొలుచుకొని మూలం చూడటానికి వరాహరూపంలో వెళ్ళాడట. బ్రహ్మ ఏమో అంతం చూడాలని ఆకాశం దిక్కుగా వెళ్ళాడట. ఎంతగా తవ్వినా, ఎంత లోతుకు వెళ్ళినా ఆది అన్నదే కానరాక శ్రీహరి నిరాశతో వెనకకు వచ్చాడట. అయితే బ్రహ్మదేవుడు మాత్రం తాను చివర చూచే వచ్చానని అబద్ధం చెప్పదలచి, అందుకు సాక్ష్యంగా మొగలిపువ్వును, గోవును తెచ్చుకున్నాడట. ముళ్ళపువ్వయిన మొగలి బ్రహ్మకు వత్తాసుగా "అవునవును, ఆ స్తంభపు అంతు ఈయన చూచాడు" అని చెప్పిందట. సాత్వికురాలయిన గోమాత తలతో అవునని చెప్పినా, తోకతో 'కాదు కాదు' అని ఊపి చెప్పిందట. శ్రీహరి మాత్రం నిజాయితీగా తాను ఆ స్తంభపు ఆదిని చూడలేకపోయానని అంగీకరించాడు. ఆ వెంటనే అక్కడ వెలుగులు చిమ్మే పరమశివుని జ్యోతి స్వరూపం ప్రత్యక్షమైంది. దానిని మహా లింగోద్భవ వేళ అంటారు. తన నిజాయితీకి గుర్తుగా శ్రీహరి సర్వలోక పూజ్యుడవుతాడనీ, అసత్యమాడిన బ్రహ్మకు పూజలు అమరవనీ, ఆ అసత్యానికి వంత పలికిన మొగలిపువ్వుకు పూజాపుష్పాలతో స్థానం ఉండదనీ, గోవు శిరస్సుకు పూజార్హత కలుగక-

పుచ్ఛానికి మాత్రమే పూజార్హత ఉంటుందనీ శివుడు శాసించాడట. ఇది బాగా ప్రచారంలో ఉన్న కథ. పరమేశ్వరుడు సుస్థిరుడైన ధ్యానయోగి. ఆయన తన సతీవియోగంతో బాధపడి హిమాలయాలలో తపస్సు ప్రారంభించాడు. ఆ సమయంలో దేవేంద్రాదులు, పార్వతీ పరమేశ్వరులకు కలిగే పుత్రుడు మాత్రమే తారకాసుర వధ చేయగలడని నిర్ణయించుకొని, పార్వతి పట్ల శివునికి అనురాగం కల్పించవలసిందిగా మన్మధుడిని వేడుకున్నారు. అతడు తన విరితూపులతో ఆయన మనస్సు చెదరగొట్టాడు. ఒక్కక్షణం చలించిన శివుడు అంతలోనే-మరుక్షణంలోనే మేల్కొని తన చాంచల్యానికి కారకుడు మన్మథుడని గుర్తించి, తన చిచ్చఱ కంటిచూపుతో అతడిని దహింపజేశాడు. కాని రతీ విలాపంతో కరిగిపోయి అతడు అతనుడిగా (తనువు లేనివాడుగా) జీవించే ఉంటాడని వరమిచ్చాడు. తనలో ఏ కొంచెం చాంచల్యం కలిగినా యోగి అయిన వాడు వెంటనే దాని మూలకారణాన్ని శోధించి దానిని నాశనం చెయ్యాలి- అన్నది ఈ గాథలోంచి మనం నేర్చుకోవాలి.

క్షీరసాగర మధనం సాగుతున్నది. మొదట హాలాహలం అనే భీకరవిషం పాలసంద్రం కడుపులోంచి బయటకు వచ్చినది. లోకాలన్నిటినీ దహించాలని ఉధృతంగా సాగుతోంది. ఆ సమయంలో దేవతాగణం ఈశ్వరుని శరణువేడింది. అప్పడాయన “పరహితము చేయునెవ్వడు, పరమహితుడగు భూత పంచకమునకున్” అని చెప్పి, సర్వమంగళాదేవిని ఒప్పించి ఆ ఘోర హాలాహలం మొత్తాన్ని ఒక చిన్న నేరేడుపండులా మింగి వేసి “గరళకంఠుడు” అయ్యాడు. క్షీరాబ్ధి నుండి వచ్చిన లక్ష్మి, ఐరావతం, ఉచ్చై (శ్రవం, అమృతం, ఔషధాలు అన్నీ అందరూ పంచుకోగా శివుడు తన కంఠంలోని కాలిమే (నలుపే) తన తనకాభరణంగా ప్రకాశించాడు. విశ్వజనీనమైన ఆ ప్రేమ, ఆ త్యాగబుద్ధి ఆయనను లోకోత్తరుడిని చేశాయి.

లింగోద్భవమైన శివరాత్రినాడు పగలు ఆయన పేరిట ఉపవాసం ఉండటం ఆ రాత్రి జాగరణ చేయడం తెలుగు వారికి సంప్రదాయంగా





వస్తోంది. ఇది కాళేశ్వరం, దక్షారామం, శ్రీశైలం అనే త్రిలింగాల మధ్య ఉన్న భూమి కనుక (త్రిలింగ-తెలుగు) శివరాత్రి ఇక్కడ చాలా చక్కగా జరుగుతుంది. మన తెలుగువాళ్ళలో మల్లయ్య, మల్లికార్జున్, పార్వతి, భవాని, దుర్గ, భ్రమరాంబ, భీమారావు, ఈశ్వరయ్య, శివయ్యలు కోకొల్లలుగా కనిపిస్తారు. మార్కండేయుని పైకి వచ్చిన మృత్యువును ఒక్క తన్ను తన్ని ఆ కుర్రవాడిని రక్షించి మృత్యుంజయుడైన పరమేశ్వరుడే షిరిడీలో శ్రీ సాయిగా వెలసి మూడురోజులపాటు తన నిర్జీవ శరీరాన్ని అందరిముందూ ఉంచి, అటుపైన సజీవుడై లేచి కూర్చున్నాడు.

శివుడు భోళాశంకరుడు. ఉబ్బుశంకరుడనీ అంటారు ఆయనను. స్తుతి మాత్రాన పొంగిపోయి వరాలిచ్చేసే నిష్కపటి శివుడు. తాను నెత్తిన చెయ్యి పెట్టగానే అవతలివాడు భస్మమైపోవాలని వరమడిగి పొంది, దానిని పరీక్షించడానికి శివుడినెత్తినే చెయ్యి పెట్టబోయిన భస్మాసురుని కథ జగమెరిగినదే గదా! ఆంధ్రదేశంలోని పంచారామాలు దేశమంతటా ప్రసిద్ధ మైనవి. అమరారామంలోని (అమరావతి)లోని అమరేశ్వరుడు, దక్షా రామం (ద్రాక్షారామం)లోని భీమేశ్వరుడు, క్షీరారామం (పాలకొల్లు) లోని క్షీరలింగేశ్వరుడు, కుమారారామం (సామర్లకోట)లోని కుమార లింగేశ్వ రుడు, భీమారామం (భీమవరం)లోని సోమేశ్వరస్వామి-యివన్నీ సుప్రసిద్ధ శివక్షేత్రాలే కావటం విశేషం. తెలుగువారు ప్రాథమికంగా శైవులని పెద్దలంటారు.

అటువంటి శివుని పేరిట చేసే ఉపవాస, జాగరణలు నిష్ఠగా ఉండాలి. అంతేగాని ఏదో అదొక వేడుకగా అదో ఉత్సాహంగా జరుపుకోవడం అంత మంచికాదు. నిర్మలచిత్తంతో శివధ్యానం చేయటం, శివగాథలు వినడం, భజనల్లో పాల్గొనడం మంచిపని. అర్ధరాత్రివేళ శివునికి అభిషేకం చేయటం చాలా ప్రశస్తం. సాయిభక్తులు సాయీశ్వరునికి చేయవచ్చు. జాగరణ సమయంలో సినిమాలు చూడటం, టీవీలు చూడటంగాక, పిల్లలకు శివుని గురించిన కథలు చెప్పడం, కొన్ని ప్రశ్నలు ఇచ్చి జవాబులు చెప్పించడం మంచిది. అలా శివరాత్రిని శ్రద్ధాసక్తులతో పవిత్రంగా గడుపుకుందాం.

# ఇదీ గడిచిపోతుంది

**- మాతాజీ**

ఒక యువకుడు దేశసంచారం చేస్తూ చేస్తూ ఒక గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ అతనికొక బాధాకరమైన దృశ్యం కనిపించింది. ఒక బలిష్ఠుడైన వ్యక్తి ఎద్దుకు బదులుగా నూనెగానుగ చక్రాన్ని లాగుతున్నాడు. చక్రం రాతిది. చాలా బరువుంటుంది. దాన్ని ఒక మనిషి లాగడమంటే చాలా కష్టం గదా! యువకుడి మనసు ద్రవించిపోయింది. అతనికి దగ్గరగా వెళ్ళి "అన్నా! ఇలా పనిచేస్తే ఎంతకాలం బ్రతకగలవు?" అన్నాడు బాధగా. అతడొక్క నిమిషం ఆగి, చెమట తుడుచుకొంటూ యువకుని కళ్ళలోకి చూచి చిరునవ్వు నవ్వాడు. "ఇదీ గడిచి పోతుంది గద తమ్ముడూ!" అన్నాడు. యువకుడు అతని ధైర్యానికి అబ్బుర పడుతూ ముందుకు కదిలిపోయాడు.

ఐదారేళ్లు గడిచాయి. యువకుడు మళ్లీ ఆ గ్రామం మీదుగా వెళ్ళవలసి వచ్చింది. నూనెగానుగ ఆడించే పేదవాడు గుర్తువచ్చాడు. పాపం, అలసి క్రుంగి కృశించి ఉంటాడు. అసలున్నాడో పోయాడో-అనుకొంటూ గానుగవైపు వెళ్లాడు. ఆశ్చర్యం! అతను చక్కగా కుర్చీలో కూర్చొని గానుగ పనిని పర్యవేక్షిస్తూ-నూనె కోసం వచ్చేవారికి అమ్మి డబ్బులు తీసుకొంటూ కనిపించాడు. యువకుడు అతని దగ్గరకు వెళ్ళగానే నవ్వి "బాగున్నారా?" అని పలకరించాడు. "ఇప్పడు నీ పరిస్థితి మారిపోయినట్లుందే!" అన్నాడు యువకుడు. "మా యజమాని తన ఒక్కగానొక్క కూతురినీ, గానుగనూ కూడా నాకు ఇచ్చేసి మరణించాడు. ఇప్పడు ఇలా ఉన్నాను. కానీ యిదీ గడిచిపోతుంది సోదరా!" అన్నాడు అతను. యువకుడు అతనెప్పడూ అలా ఆనందంగానే ఉండాలని కోరుకొంటూ తన త్రోవన తాను వెళ్ళిపోయాడు.

అలాఅలా మరో పదేళ్లు గడిచిపోయాయి.





ఇప్పడు మన యువకుడు నడివయస్కుడైనాడు. అతడికి పెళ్లీ పేరంటం అయ్యాయి. పిల్లా మేకా- సంసారభారాలు-ఇక్కట్లు, ఎప్పడన్నా చిన్న చిన్న ఆనందాలు ... వీటన్నింటి మధ్యలో యితనికి ఆ గానుగాయన మాటలు గుర్తు వస్తుంటాయి. "ఇదీ గడిచిపోతుంది సోదరా!" అని. 'నిజమేనా!' అనిపించేది కొన్నిసార్లు. కాదనిపించేది కొన్నిసార్లు. సరే ఒకరోజు అతన్ని చూడాలనిపించింది మనవాడికి. వెంటనే బయలుదేరి ఆ గ్రామానికి బయలుదేరాడు. అది ఒక మహానగరాన్ని ఆనుకొని ఉంది. మనవాడు నగరంలోకి వెళ్లగానే చాలా కోలాహలం, ఉత్సవ వాతావరణం కన్పించాయి. దారినపోయే వాడినొకడిని ఆపి విషయం ఏమిటని అడిగి తెలుసుకున్నాడు మనవాడు. "మా రాజ్యాన్ని ఏలే మహారాజుగారు నిస్సంతువుగా మరణించారు. వారి తరువాత ప్రభువును ఎంపిక చేసేందుకు పట్టపుటేనుగును వదులుతారివ్వేళ. అది ఎవరి మెడలో మాలవేస్తే వారే రాజవుతారు. అదీ హడావుడి" అన్నాడు అతగాడు. మనవాడికి అదేదో సరాదాగా అనిపించి అతనితోపాటే పట్టపుటేనుగును అలంకరించే చోటికి వెల్లాడు. ముందు ఏనుగుకు నెయ్యి, బెల్లం కలిపి తినిపించారు. ఒక అరటిపళ్ల గెల యిచ్చారు. వీపున అంబారీ, నుదుట, శిరసున రత్నాలు పొదిగిన పట్టువస్త్రం, కాళ్లకు బంగారు కడియాలు-గొప్ప రాచఠీవితో నిలబడింది ఏనుగు. మహామంత్రి, రాజగురువు వచ్చి దాని తొండం నిమిరి "సత్ప్రభువుకు ఏరికోరి వెయ్యాలి సుమా మాల!" అని చెప్పారు. పెద్ద పూలమాల దానికి అందించారు. పట్టపుటేనుగు తొండంపైకెత్తి ఒక్కసారి ఘీంకరించింది సరేనన్నట్లు. రాజగురువు పాదాలు తన తొండంతో తాకింది. అప్పడు అందుకొన్నది పూదండ. "జంతువైనా ఎంత వివేకం!" ఆశ్చర్యపోయాడు మనవాడు.

ఏనుగు గంభీరంగా ఒక్కసారి కలియజూచింది. ఠీవిగా నడుచుకొంటూ ముందుకుసాగింది. రాజ్యసింహాసనం మీద ఆశ

ఉన్నవాళ్లు అది తమవైపు చూడాలన్న ఆశతో దానికి దగ్గరగా వెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. అది మాత్రం ఎవ్వర్నీ చూడడం లేదు. గుంపు మధ్యగా నడుస్తూ వెళ్లిపోతోంది. వెళ్లి వెళ్లి, ఎక్కడో ఆ గుంపు వెనుక యీ చోద్యమంతా చూస్తూ నిలబడి ఉన్న ఒక వ్యక్తి మెడలో పూలమాల వేసింది. మనవాడు కూడా ఆ భాగ్యశాలి ఎవరో చూడాలని అటువైపు వెళ్లాడు-అందరితోపాటు. ఆ వ్యక్తిని చూస్తూనే ఆశ్చర్యంతో తలమునకలయ్యాడు-గానుగవ్యక్తే అతడు. మనవాడు అందరినీ తప్పించుకుంటూ అతని దగ్గరకు వెళ్లాడు. మామూలుగా పలకరించబోయాడు గానీ సంకోచంతో ఆగిపోయాడు. అతనిప్పుడు మహారాజు మరి! కానీ, అతను వీడిని చూస్తూనే చిరునవ్వుతో "బాగున్నావా సోదరా!" అని పలకరించాడు. "వ్యాపారం పనిమీద నగరానికి వచ్చి, ఏదో జరుగుతోందని చూడటానికి యిక్కడ నిలబడ్డాను. ఇదుగో-యిలా జరిగింది'' అన్నాడు. ''నాకు చాలా సంతోషంగా ఉంది నీవు....మీరు-మహారాజైనందుకు" అన్నాడు మనవాడు. అతడు తనకు అలవాటైన చిరునవ్వుతోనే "ఇదీ గడిచిపోతుందిగా!" అన్నాడు. మనవాడు తెల్లబోయాడు. "ఏ స్థాయిలో ఉన్నా యితని భావం మారటం లేదే! అనుకొన్నాడు. అంతలో రాజుగారిని తనపై ఎక్కించుకొని పట్టపుటేనుగు రాజభవనంవైపు సాగిపోవటంతో మనవాడు తన ఊరి దారిబట్టాడు.

మరో పదిహేనేళ్లు గడిచాయి. అలనాటి యువకుడు ఇప్పడు వృద్ధుడై పోయాడు. వ్యాపారాదులన్నీ కొడుకులకు అప్పగించి, తాను విశ్రాంతిగా ఉంటూ, వీలు చిక్కినప్పడల్లా తీర్థయాత్రలు చేస్తూ ఉన్నాడు. ఓసారి అలాటి తీర్థయాత్రాటనంలో ఉండగా మన వృద్ధుడికి మహారాజైపోయిన గానుగతన్ని చూడాలనిపించింది. ఆయన ఉన్న నగరానికి వెడదామని బయలుదేరాడు. కానీ, అతనికి ఆ నగరంగానీ, గానుగ ఉన్న ఊరుగానీ కనబడలేదు. అతను తాను త్రోవ తప్పానేమోననుకొన్నాడు మొదట. కానీ





అతనికి బాగా గుర్తు అదిగో ఆ నదీ, యీ అడవీను. ఎటొచ్చీ ఆ పరిసరాలలోని ఏ ఒక్క ఊరూ, ఇల్లూ లేవిప్పడు. అలా ఆలోచిస్తుండగా ఒక పశువుల కాపరి అటుగా వచ్చాడు-మన వృద్ధుడు అతన్ని అడిగాడు ఆ నగరానికి దారిని గూర్చి. అతడు కనుబొమలు ముడివేసి "తమది యీ ప్రాంతం కాదా స్వామీ?" అని అడిగాడు. మన వృద్ధుడు కాదనీ, ఏదో యాత్ర కోసం వెడుతూ అటువచ్చాననీ చెప్పాడు. "అలా చెప్పండి! అందుకే మీకు అసలు విషయం తెలియలేదు. నాలుగేళ్లయింది స్వామీ! ఈ చుట్టుప్రక్కలంతా  భూకంపం వచ్చింది. పెద్దపెద్ద భవనాలే క్షణంలో కూలిపోయాయి. పదిఊళ్లు రూపులేకుండా మాసిపోయాయి. అదుగో-ఆ కనపడే రాళ్లగుట్టలన్నీ మీరడిగిన ఊరి భవనాలే. ఒక్కప్రాణమైనా దక్కితే ఒట్టు స్వామీ! ఇటువంటి గోరం మా తాతలనాడు గూడ యినలేదని మానాయన చెప్పాడు సామీ!" అన్నాడు పసులకాపరి. మన వృద్ధుడికి చెవుల్లో రింగుమన్నది-"ఇదీ గడిచిపోతుంది సోదరా!" అన్నమాట. ఎంత సత్యం అతని మాట!

ఎప్పటికప్పడు ఆనాటి దశ ఏనాటికో ఒకనాటికి మారిపోతుందని అతనికి ప్రగాఢ నమ్మకం. అందుకే ఏనాడూ గానుగలాగిన బాధకు దిగులుపడనూ లేదు-మహారాజ పదవికి పొంగనూ లేదు. మన వృద్ధుడు గానుగతని స్మృతితో చెమర్చిన కళ్లు తడుచుకొంటూ అనుకొన్నాడు - "అవును-ఇదీ గడచిపోతుంది".

There is a sufficiency in the world for a man's need but not for greed. ***- Bapuji***

**ప్రపంచంలో మనిషి అవసరాలకు సరిపడా సంపద ఉంటుంది. కానీ, మనిషి ఆశబోతుతనానికి కావలసినంత ఉండదు.**

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

(గత సంచిక తరువాయి)

**తన కన్నా తన వారికి**

ఆబూబెన్ ఏడెమ్‌కు అర్ధరాత్రి మెలకువ వచ్చింది. తన గది నిండా నిండిన ఒక విచిత్రమైన ప్రకాశంలో ఒకరు కూర్చొని ఏదో వ్రాస్తున్నారు... చూస్తే ఒక దేవదూత! ఆబూ ధైర్యం చేసి "ఏమి వ్రాస్తున్నావు?" అని అడిగాడు. "దైవాన్ని ప్రేమించే వాళ్ల పేర్ల జాబితా వ్రాస్తున్నాను" అన్నది ఆ తేజస్సు. "నా పేరున్నదా అందులో?" ఆబూ అడిగాడు. వెదికి చూచి లేదన్నది దేవదూత. ఆబూ కొద్దిగా నిరాశ చెందినట్లు కన్పించినాగానీ ఉత్సాహంగా "అయితే నా పేరు సాటి మానవులను ప్రేమించేవాడినిగా వ్రాయి" అన్నాడు. "సరే"నని అదృశ్యమైపోయింది దేవదూత.

మరునాటి రాత్రి మళ్ళీ ఆ తేజస్సు రాకతో మెలకువ వచ్చింది ఆబూకు. అదే దేవదూత- తన దగ్గరున్న పేర్ల జాబితా చూపించింది. అది భగవదాశీర్వచనం పొందిన వాళ్ళ పేర్ల జాబితా. అందులో మొట్టమొదటి పేరు ఆబూదే. అందుచేత దైవాన్ని ప్రేమించటం పేరిట చేసి జప తప యజ్ఞాదులన్నింటికన్నా యీ సేవా యజ్ఞం చేపట్టినవాడు తొందరగా పరమాత్ముని అనుగ్రహానికి పాత్రుడవుతాడన్న మాట. "లేహంట్" వ్రాసిన యీ ఆంగ్లపద్యం జగత్ప్రసిద్ధం. మరొక ఉదాహరణ చూద్దాం.

ఓ నగరం మధ్య ఎత్తైన వేదిక పైన ఉన్నదొక చక్కని విగ్రహం. బంగారు





తొడుగు, కళ్లలో నీలాలు, ఖడ్గంలో ఒక రత్నం .... నిలువెల్లా విలువైన గొప్ప రాచ విగ్రహం. ఒకరోజు దాని దగ్గరకు ఒక చిలక వచ్చి చేరింది. ఆ చిలక యాత్రలు తిరుగుతూ తిరుగుతూ చలి ముదరటం చేత యిక ప్రయాణం చెయ్యలేననుకొని యింటికి తిరిగి వెడుతోంది. త్రోవలో ఆ రాత్రి విశ్రాంతి కోసం ఆ విగ్రహం దగ్గరకి వచ్చింది. ఆ విగ్రహం పాదాల దగ్గర ముడుచుకుపడుకున్నది. కానీ చలి చాలా ఎక్కువగా ఉండటంతో లేచి వెళ్లిపోబోయింది. అంతలో -

"చిలకమ్మా వెళ్లిపోతున్నావా?" అని వినిపించింది. ఆశ్చర్యంతో నోరు తెరిచింది. చిలక ... బొమ్మ మాట్లాడటం చూచి. ఆ బొమ్మ తాను ఆ రాజ్యాన్ని పాలించిన రాజుననీ, చింత అంటే తెలియని ఆనందంతో జీవిస్తుండటంతో చేత తనను ఆనందప్రభు అనే వారనీ చెప్పాడు ఆ రాతి విగ్రహంలోని ప్రభువు.

తన ప్రజలు కష్టాలు పడుతుంటే తనకు దుఃఖం వస్తుందన్నాడు. తన హృదయం యీ బొమ్మలోకి వచ్చేసిందన్నాడు. ప్రజలకు సాయపడాలని తనకున్నప్పటికీ తన మాటలెవరికీ వినపడకపోవటంతో ఏమీ చేయలేక పోతున్నానన్నాడు. చివరకి చిలక సాయం కోరాడు. పోనీ గదా అని ఒక్కరోజు ఆగడానికి ఒప్పుకున్నది చిలక.

"అదిగో, ఊరి చివర ఆ వంతెనుందే ... దాని ప్రక్కన గుడిసె ఉందిగా! అందులో ఒక అవ్వ, మనవడు ఉన్నారు. పిల్లవాడికి తీవ్రమైన జ్వరం. మందూ లేదు, మాకూ లేదు - చివరకి వాడికి కప్పటానికి మంచి దుప్పటైనా లేదు. అందుకని ఆ అవ్వ ఏడుస్తోంది. ఇదిగో నా కత్తిపిడిలో ఒక రత్నం ఉంది. దీన్ని తీసుకువెళ్లి ఆ పిల్లవాడి పక్కలో వేసిరా. ఇది అమ్ముకుంటే వాళ్ల జీవితమంతా హాయిగా బ్రతికేంత డబ్బు వస్తుంది"

అన్నాడు ఆనందప్రభు.

చలిలో వణుకుతూ ఆ పనిచేసి వచ్చింది చిలక. అయితే వెళ్లేటప్పుడున్నంత చలి వచ్చేటప్పుడు లేకపోవటం గమనించింది. ఆ మాటంటే మంచిపని చేసిన గుండెకు నులివెచ్చదనం అలాగే వస్తుందన్నాడు ప్రభు.

చిలక మరునాడు ఇంటికి బయలుదేరుదామనుకొన్నది. కానీ ప్రభు కోరిక మీద ఆగిపోయింది. ఎక్కడో దూరదేశంలో జబ్బు పడిన తన కొడుకు దగ్గరకు వెళ్లడానికి డబ్బులేక అల్లాడే ఒక తల్లికి తన కంటిలో ఉన్న నీలాన్ని పీకి యిచ్చి రమ్మన్నాడు ఆనందప్రభు. చాలాసేపు వాదించి, ఓడిపోయిన చిలక అతని కోరిక తీర్చిందే గానీ, మనసులో చాలా బాధపడింది.

కానీ ఆ మరునాడు నా అనేవారెవ్వరూ లేక భిక్షమెత్తుకొని బ్రతికే ఓ ఏడేళ్ల పిల్లకు ఆ రోజు ఏమీ దొరక్క ఏడుస్తోందనీ, ఆ పిల్లకు తన రెండవ కంటిలోని నీలం పెరికి యిచ్చి రమ్మనీ అన్నప్పుడు మాత్రం చిలకమ్మ గట్టిగా ఎదురు తిరిగింది. "నా ప్రజలు నా ప్రజలు అంటావు... రెండూ కళ్ళూ లేకపోతే ఎలా చూస్తావు వాళ్లను?" అని విసుక్కొంది. అయినా ప్రభు తన పట్టు వదలకుండా చిలకమ్మ గుండె కరిగేలా మాట్లాడేటప్పటికి అది లొంగిపోయింది. చాలా బాధపడుతూనే రెండవ కంటినీలం పీకి ఆ పేదపిల్ల భిక్షాపాత్రలో వేసి వచ్చింది.

అటుపైన ఆనందప్రభు త్యాగానికి కరిగిపోయిన చిలకమ్మ ఆనందప్రభును విడిచివెళ్లలేకపోయింది. ఊరంతా తిరిగి ఎన్నెన్నో కబుర్లు తెచ్చేది. పండో, కాయో తినేసి వచ్చి, ఊరి కబుర్లు చెప్తూ గడిపేది. ఆనంద ప్రభు తాను రాజుగా ఉన్నప్పటి విశేషాలు చెప్పేవాడు. హాయిగా నవ్వుకొనే





వారు. ఇలా గడుస్తోంటే ఒకరోజు ఎక్కడో చాలామంది జనం గోలగోలగా ఏడుస్తున్న శబ్దం వినిపించింది. అదేమిటో తెలుసుకు రమ్మన్నాడు ప్రభు.

"తెలుసుకొని ఏం చెయ్యగలం చెప్పు" అంది చిలక.

"అసలేమైందో ముందు చెప్పు" అన్నాడు ప్రభు.

"కాలవ అవతల గ్రామంలోని రైతులు పన్నులు కట్టలేదు. వానలు లేవు.... పంటలు పండలేదు.... అంచేత కట్టలేదు. రాజభటులేమో వాళ్లకున్న గొడ్డూ, గోదా లాక్కుపోతున్నారు. అవీ లేని వాళ్ల యిల్లూ వాకిలీ జప్తు చేస్తున్నారు. అందుకని రైతులంతా గోడుగోడున ఏడుస్తున్నారు" అంది చిలుక. "అయినా మనమేం చెయ్యగలం! ఇంకేమీ లేవుగా మన దగ్గర!" అని కూడా అన్నది.

"అయ్యో, లేకపోవటం ఏం! ముక్కుతో నా ఒంటి మీద యిలా గీరి చూడు. సన్నని బంగారురేకు వస్తుంది. నా ఒళ్లంతా బంగారు రేకులు పొదిగి ఉన్నాయి. గీరుకొని తీసుకెళ్లి ఆ పేదరైతుల యిళ్లల్లో వేసిరా చిలకమ్మా" అన్నాడు ప్రభు. చిలకకు ఏడుపు వచ్చింది. ఏమిటీ ప్రభువు! ఈయన కరుణకు అంతం లేదా!

అక్కడి నుండి రోజుకొక తొడుగు చొప్పున ఏడు రోజుల పాటు ఆనంద ప్రభు శరీరం మీది బంగారురేకులన్నీ పేద రైతుల గడపల్లోకి వేస్తూ శక్తికి మించిన పని చేస్తూ బాగా అలసిపోయింది చిలక. ఇప్పుడు ఆనందప్రభు విగ్రహం చాలా మామూలు బొమ్మ. అలంకారాలు లేని ఉత్త కంచు బొమ్మ.

**(సశేషం)**

నీవేమిటో నీవు తెలుసుకోవాలంటే ఒకే మార్గం - లోకసేవలో నిన్ను నీవు కరిగించుకోవటం. **- మహాత్మాగాంధీ**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

**25-12-1911**

ఉదయం ప్రార్థనల తరువాత సాయి మహరాజ్ బయటికి వెళ్లటం చూచాను. మహాజనితో, ఇతరులతో మాట్లాడుతూ కూర్చున్నాను. చాలామంది అతిథులు వెళ్లారు, మరెందరో వచ్చారు. ఒకటే హడావుడిగా ఉంది అంతా. గోవర్ధనదాస్‌గారు సాయిమహరాజును చూడవచ్చిన ప్రతివారినీ విందుకు పిలిచాడు. గత రాత్రి మా బలవంత్‌కు ఒక కల వచ్చింది. అందులో సాయి మహరాజు, బాపూ సాహెబ్ జోగు మా ఎలిచ్‌పూర్ ఇంట్లో ఉన్నట్లు కనిపించింది వాడికి. వాడు బాబాకు భోజనం పెట్టాడు. ఈ కల గురించి వాడు చెప్పాడు గానీ నేను అదేదో వాడి ఊహ అనుకున్నాను. కానీ ఇవ్వేళ సాయి బలవంత్‌ను పిలిచి, “నేను మీ యింటికి వచ్చాను నిన్న. నీవు భోజనం పెట్టావుగానీ దక్షిణ యివ్వలేదు. ఇప్పుడు పాతిక రూపా యలివ్వు” అన్నారు. బలవంత్ విడిదికి వచ్చి, మాధవరావును వెంటబెట్టుకు వెళ్లి దక్షిణ యిచ్చి వచ్చాడు. మధ్యాహ్న హారతివేళ సాయి మహరాజ్ నాకు పాలకోవా, పళ్లు ఇచ్చి తలవాల్చమని సైగ చేసారు. వెంటనే నేను సాష్టాంగం చేసాను. ఇవ్వేళ ఉదయ భోజనం బాగా ఆలస్యమైంది. సాయంత్రం 4 గంటల వేళ గోవర్ధనదాసుతో కలిసి మా విడిది ముందట మంటపంలో తిన్నాను. ఆ తరువాత నాకు చాలా బద్ధకంగా ఉండి మాట్లాడుతూ కూర్చుండిపోయాను.





మేమంతా సాయిని వాహ్యాళికి వెళ్లేప్పుడూ, చావడి ఉత్సవంలోనూ కూడా చూచాము. కొండాజీ ఫకీరు బిడ్డ చనిపోయింది. ఆమెను మా విడిదికి దగ్గర్లోనే ఖననం చేసారు. భీష్మ భజన, దీక్షిత్ రామాయణం మామూలే.

**26-12-1911**

నేను పెందలకడనే లేచి కాకడ హారతికి వెళ్లాను. సాయి మహరాజు ఒక విలక్షణమైన స్థితిలో ఉన్నారు. చేతిలోని కర్రతో చుట్టూ ఉన్న నేల మీద కొడుతూ ఉన్నారు. ఆయన చావడి మెట్లెక్కి దిగుతూ, మళ్లీ వెనక్కి వెడుతూ భయంకరమైన భాష ఉపయోగించారు. నేను తిరిగివచ్చి, ప్రార్థన, స్నానం ముగించు కొని గది ముందర వరండాలో కూర్చున్నాను. సాయి మహరాజు బయటకువెళ్లటం చూచాను. గోఖలే (పూనా ప్లీడరు) వచ్చారివాళ. నా భార్యనతడు షేగాంవ్‌లో గణపతి బాబా సజీవంగా ఉన్నపుడు చూచాడు. ఆయనతో బొమ్మలమ్మే అతనొక డున్నాడు. మధ్యాహ్న హారతి తరువాత వారు నన్ను కలిసారు. భోజనానంతరం కాస్సేపు కునుకు తీసి లేచి మహాజనితోను, హాటేతోను, ఇతరులతోను మాట్లాడాను. సాయంత్రం చావడి దగ్గరా, గోధూళి వేళ ఆయన వాహ్యాళికి వచ్చినప్పుడూ సాయి మహరాజును చూచాను. ఆయన చాలా కాంతివంతంగా ఉన్నారు. మా అబ్బాయి బల్వంత్‌తో మాట్లాడారు. అందర్నీ వెళ్లి పొమ్మన్నాక కూడా వాడిని ఉంచేసారు. ఆయన వాడికి “సాయంత్రం అతిథుల నెవరినీ రానివ్వకు. నా గురించి జాగ్రత్త తీసుకో. బదులుగా నేను నీ పట్ల శ్రద్ధ వహిస్తాను” అని చెప్పారు. మాధవరావు దేశ్‌పాండేకు బాగా జలుబు చేసి పడుకొనే ఉన్నాడు. సాయంత్రం మామూలుగానే భీష్మ భజన, దీక్షిత్ రామాయణం జరిగాయి. భాటే ఉన్నాడు వింటూ. మేము సుందరకాండ ప్రారంభించాము ఇవ్వేళ.

**(సశేషం)**

# సాయితో తర్ఖడ్ స్మృతులు - 8

**- శ్రీ వీరేంద్ర జ్యోతీంద్ర తర్ఖడ్**

**(గత సంచిక తరువాయి)**

ఇప్పటికీ తర్ఖడ్ కుటుంబం యితర సాయిభక్తులతో ఎక్కువ సాన్నిహిత్యం పెంచుకున్నారు. వారిలో శ్రీ దభోల్కర్, శ్రీ పురంధరే, శ్రీ తెండుల్కర్, వీరంతా బాంద్రాలో వీరింటికి దగ్గరగానే ఉంటారు. వారు ఒకరికొకరు కలుసుకుంటూ బాబాతో తమకు కలిగిన అనుభవాలను చెప్పకుంటూ ఉండేవారు. ఎప్పడయినా వారు షిరిడీ వెళ్ళాలనుకున్నప్పడు ఏదో ఒక నివేదనను ఆ భక్తుని తరఫున బాబాకు చేరవేస్తూ ఉండేవారు. దీని వెనకనున్న వారి ఉద్దేశ్యం బాబా మీద తమకున్న స్వచ్ఛమైన భక్తిని, ప్రేమని తెలిపేటందుకే. ఒకసారి పురంధరేగారు తమ కుటుంబంతోసహా షిరిడీ వెడుతున్నప్పడు మా నానమ్మగారు. పురంధరే భార్యకు రెండు నల్ల వంకాయలనిచ్చి ఒక కాయతో పెరుగుపచ్చడి, రెండవ దానితో వంకాయ ముక్కల వేపుడు చేసి బాబాగారికి భోజనం వడ్డించమని చెప్పింది.

మొదటిరోజు పురంధరే భార్య వంకాయ పెరుగుపచ్చడి చేసి మిగతా పదార్థాలతోపాటు బాబా భోజనపళ్ళెంలో వడ్డించింది. బాబా వంకాయ పెరుగుపచ్చడి భుజించి, వంకాయ వేపుడు కావాలనే కోర్కెను తెలియజేసారు. షిరిడీలోని (స్థానికంగా ఉండే భక్తురాలు) రాధాకృష్ణ మాయికి ఏమి తోచలేదు. ఈమె బాబాగారికి భోజన ఏర్పాటులన్నీ చూస్తూ ఉండేది. ఆమె అక్కడ ఉన్న ఆడవారిని అందరిని అడిగి పురంధరుని భార్య వంకాయపచ్చడిని తెచ్చిందని తెలుసుకుంది. ఏది ఏమయినప్పటికీ అది వంకాయల కాలం కాదు. కనుక షిరిడీలో అప్పడు వంకాయలు దొరకటం కష్టం. అంచేత రాధాకృష్ణమాయి పురంధరుని భార్య వద్దకు వెళ్ళి వంకాయలు ఎక్కడ దొరుకుతాయి అని అడిగింది. అప్పడామె తన దగ్గర ఒకటి ఉందని, దానిని మరునాడు బాబాకి వేపుడు చేసి పెట్టటానికి ఉంచానని చెప్పింది. అప్పడు రాధాకృష్ణమాయి ఆ వంకాయను తీసుకువెళ్ళి, తొందరగా బాబాకి వేపుడు చేసి పెట్టాకే బాబా వాటిని స్వీకరించి భోజనం ముగించి లేచారు. ఇప్పడిది బాబా తన భక్తులపై స్వచ్ఛమైన ప్రేమను తెలియజేసే సంఘటన. తన భక్తుల నుంచి వారి భక్తిని స్వీకరించారన్న దానికి నిర్ధారణ. పురంధరే భార్య బాంద్రాకు తిరిగి వచ్చిన తరువాత ఈ సంఘటన నానమ్మకు చెప్పినప్పడు, ఆవిడ యెంతో సంతోషించి, తన హృదయాంతరాళాలలోనించి బాబా వారికి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

ఇదేవిధంగా ఒక సాయంత్రం గోవింద్‌జీ (బాలక్‌రాం కుమారుడు) తార్ఖడ్‌గారి ఇంటికి వచ్చి తాను, ఆ రాత్రికి షిరిడీ బయలుదేరి వెడుతున్నానని చెప్పాడు. తాను స్వర్గీయుడైన తన తండ్రి అస్తికలను నాసిక్‌లో నిమజ్జనం చేసిన తరువాత, అక్కడ నుండి షిరిడీకి వెడతానని చెప్పాడు. అతను చాలా తొందరలో ఉన్నందువల్ల మా నానమ్మగారికి బాబాకు పంపించడానికి సరైనది ఏదీ దొరకలేదు. తాను యింతకుముందే బాబా చిత్రపటం ముందు ఉంచిన ప్రసాదం, ఒక కుండలో ఉన్న కోవా తీసి మనస్సులో యిష్టంలేకపోయినా దానినే యిస్తున్నానని చెప్పింది. కారణం ఆ ప్రసాదం అంతకుముందే బాబాకి సమర్పించేసినది గదా అన్నది.

అంతేకాకుండా గోవింద్‌జీ అస్తికల నిమజ్జనం కార్యక్రమంతోపాటు షిరిడీకి కూడ యాత్ర పెట్టుకున్నారు. భక్త శబరి శ్రీరాముల వారికి తాను రుచిచూసిన రేగుపళ్ళను సమర్పించినట్లు భక్తి భావం ప్రదానం గదా అనుకొని తక్కిన ఆలోచనలు పక్కకు నెట్టేసి ఆ ప్రసాదాన్ని పంపించారు.

గోవింద్‌జీ తన కార్యక్రమాలన్నిటినీ పూర్తి చేసుకొని ద్వారకామాయిని చేరుకున్నప్పడు అతను నానమ్మ యిచ్చిన కోవాను గూర్చి మరచి

పోయాడు. బాబా అతనిని తనకోసం ఏమైనా తెచ్చావా అని అడిగారు. గోవింద్‌జీ లేదు అని చెప్పారు. అప్పుడు బాబా నాకిమ్మని ఎవరో ఏదో యిచ్చారని గుర్తు చేశారు. గోవింద్‌జీ మతిమరుపుతో శిలలా ముఖంపెట్టి లేదని చెప్పాడు. అప్పుడు బాబా కోపంతో అరుస్తూ "ఏయ్ నువ్వు బొంబాయి నుండి బయలుదేరేటప్పుడు మా అమ్మగారు నాకు ఇమ్మని ఏదో యిచ్చింది కదా! ఏది అది?" అన్నారు. అప్పుడు గోవింద్‌జీ తెలివి తెచ్చుకొని పరుగెత్తుకుని వెళ్ళి నానమ్మ యిచ్చిన కోవా తెచ్చి బాబాకిచ్చాడు. బాబా వెంటనే దానిని తిని, 'ఈ కోవా చాలా మధురంగా ఉందని అమ్మకు చెప్పు' అని గోవింద్‌జీతో అన్నారు.

ప్రియమైన సాయి పాఠకులారా! దైవాంశ సంభూతమైన ప్రేమానురాగాల దృష్టాంతాలు స్వర్గీయ అన్నాసాహెబ్ ధాబోల్కర్‌గారు సాయి సచ్చరిత్ర 9వ అధ్యాయంలో ఎంతో మనోజ్ఞంగా వర్ణించారు. మా నాన్నగారు వాటిని మాకు వివరించి చెబుతూ ఉన్నప్పుడు ఆయన కళ్ళ నుండి కన్నీరు కారుతూ ఉండేది. ఆ విధంగా భగవంతుడి నుంచి తిరిగి ప్రేమ పొందినపుడు అలా స్పందించకుండా ఏ భక్తుడూ ఉండడని నాకనిపిస్తుంది.

నేను ఒక దానికి బాధపడుతున్నాను. "ఎక్కడికి వెళ్ళారు? ఆ ప్రజలంతా (వారందరికీ నమస్కారాలు) ఆ భక్తులంతా ఎక్కడ ఉన్నారు? అటువంటి భక్తి ఈ రోజు ఎక్కడ ఉంది? కాని బాబా ప్రేమ తమ భక్తుల మీద ఎల్లప్పుడూ వ్యాపించి ఉంటుంది.

(సమాప్తం)

ప్రియ పాఠకలోకానికి
శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు





# అనాదిగా యీ గడ్డపైని బోధలు-2

సేకరణ : అరవింద

1. **"సానో భూమి ర్వర్ధయద్ వర్ధమానా" (అధర్వ వేదం)**
   *- "మా మాతృదేశం ప్రపంచంలో ఉన్నత శిఖరం మీద ఆశీనురాలై మాకు కూడా ఔన్నత్యం ప్రసాదించుగాక!"*

2. **"ఉపసర్ప మాతరం భూమిమ్" (ఋగ్వేదం)**
   *- "నీ మాతృభూమిని సేవించు - రక్షించు".*

3. **"మాతా భూమిః పుత్రోకహం పృథివ్యాః" (అధర్వ వేదం)**
   *- "ఈ భూమి నా తల్లి. నేను ఆ మాతృభూమికి కన్నకొడుకును".*

4. **"ఊర్ధ్వం కృణ్వం త్వధ్వరస్య కేతుమ్" (ఋగ్వేదం)**
   *- "నీ దేశం యొక్క పతాకాన్ని ఉన్నతంగా ఉంచు, గౌరవించు" (ఉన్నతంగా ఉంచటం అంటే ఎత్తుగా ఎగరవెయ్యటమే కాదు - దాని స్థాయిని విశ్వమంతటిలోనూ ఉన్నత విలువలతో నింపాలి.)*

5. **"ఉత్తిష్ఠత పంసహ్యాధ్వము దారాః కేతుభిస్సహ" (అధర్వ వేదం)**
   *- "ఓయి శూరపౌరులారా, లెండి. జాతీయపతాకాన్ని చేత బట్టి దేశ రక్షణ కోసం సన్నద్ధులు కండి".*

6. **"వర్ధమానం స్వేదమే" (యజుర్వేదం)**
   *- "నీ యింటిని కూడా ఉన్నతస్థాయికి తీసుకువెళ్లు".*

7. **"తిస్రో దేవీర్మహి నః శర్మ యచ్ఛత" (అధర్వ వేదం)**
   *- "మాకు ముగ్గురు దేవతలు-జన్మభూమి, మాతృభాష, మూల సంస్కృతి-యీ ముగ్గురు ఆరాధ్యదేవతలూ మాకు గొప్ప సుఖాలనిత్తురు గాక!".*

8. **"వయం తుభ్యం బలిహృతః స్యామ" (అధర్వ వేదం)**
   *- "ఓ మాతృభూమీ, నీ రక్షణ కోసం మేము (త్రికరణ శుద్ధిగా - తను, మన, ధనాలతో) మా జీవితాలనే సమర్పించెదం గాక!"*



# శ్రీ గజానన విజయం

- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## మూడవ అధ్యాయం

గణేశ స్వామికి జయము జయము.

ఈ విధంగా గజానన మహారాజు బంకట్‌లాల్ గృహంలోనే ఉండి భక్తులకు దర్శనాలు యిస్తూ ఉండేవారు.

ఒకరోజు ప్రాతఃకాలము. మహారాజులవారు ధ్యానమగ్నులై ఉన్నారు. ఊరి ప్రజలందరు తమ తమ ఉదయకాలపు పనిపాటలలో మునిగి ఉన్నారు. అలాంటి ప్రశాంత సమయంలో స్వామీజీ దర్శనానికి ఒక బీద సాధువు వచ్చాడు. చినిగిన అంగవస్త్రం కట్టి, ఒక కాషాయవస్త్రం తలకు చుట్టి, జింకచర్మపు చుట్ట వీపున వ్రేలాడుతుండగా లోపలకు ప్రవేశించాడు. హాలు జనంతో క్రిక్కిరిసి ఉంది. అంచేత ఆయన ఒక మూల నక్కి కూర్చోవలసి వచ్చింది. అంచేత తనలో తాను "స్వామి కీర్తిని విని కాశీ నుండి యింత దూరం వచ్చాడు. దర్శనభాగ్యం పొందాను. అయితే స్వామికి గంజాయిని సమర్పించుకోవాలన్న నా కోరిక నెరవేరుతుందో లేదో? స్వామి దీనికి అంగీకరిస్తారా? చుట్టూ చేరిన భక్తులు నన్నీపనిని చేయనిస్తారా? ఇక్కడ గంజాయికి అంతగా ప్రాముఖ్యత ఉన్నట్లు లేదు. గంజాయి పీల్చే వారిని అసహ్యించుకుంటారు లాగున ఉన్నది" అనుకొన్నాడు. అతడు ఈ విధంగా ఆలోచిస్తున్న సమయంలో స్వామి తన ప్రక్కన ఉన్న భక్తుడిని పిలిచి ఆ సాధువును చూపిస్తూ - "అదిగో ఆ మూల కూర్చున్న సాధువు, కాశీ నుండి వచ్చాడు, ఆయన్ను యిటు తీసుకురా" అన్నారు. ఈ మాటలు వింటూ ఆ సాధువు ఉత్సాహంగా లేచి నిలబడ్డాడు. "జ్ఞానేశ్వరిలో చెప్పబడింది గదా మహాత్ములకు భూత భవిష్యత్ వర్తమానాలన్నీ





కరతలామలకమేనని. ఈ మహారాజు నిస్సందేహంగా గొప్ప యోగియే. వీరికి నా మనసులోని కోరిక తెలిసే ఉంటుంది" అనుకుంటూ ఆ సాధువు స్వామి దగ్గరకు వచ్చాడు.

అతన్ని చూస్తూనే గజాననులు ఇలా అన్నారు -


"నాకు సమర్పిద్దామని తెచ్చిన ఆ పదార్థాన్ని నీ జోలిలోంచి బయటకు తీయి" - ఇది వింటనే ఆ సాధువు ఆయన పాదాల మీద బోర్లా పడిపోయి పసిపిల్లవాడి మాదిరిగా నేలమీద దొర్లటం ప్రారంభించాడు.

మహారాజు అతనిని పట్టుకొని లేవదీసి "అసలు నాకు ఆ పదార్థాన్ని యివ్వాలని ఎందుకు నిశ్చయించుకున్నావు? అప్పుడు నీకు సిగ్గు అనిపించ లేదా? ఇక్కడిదాకా వచ్చి ఎందుకు జంకుతావు?" అన్నారు. ఆ సాధువు "క్షమించండి స్వామీ? దాన్ని నేను బయటకు తీసి మీకు సమర్పించు కంఉటాను. అది మీకు అవసరం లేదని నాకు తెలుసు. కాని మీరు దాన్ని తిరస్కరించవద్దని నా ప్రార్థన. నా మీది ప్రేమతో దాన్ని తమరు స్వీకరించండి. భక్తుల ప్రార్థనను భగవంతుడు అంగీకరిస్తాడు కదా! దీన్ని మీరు స్వీకరించి ఈ దీనుడిని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని నా విన్నపం" అంటూ వేడుకున్నాడు.

మహారాజు కొద్దిసేపు ఆలోచనలో పడ్డట్టు కనిపించారు. మొండి పిల్లవాని కోర్కెను ప్రేమ గల తల్లి మన్నించినట్లుగా వారు 'సరే' అన్నారు. వెంటనే ఆ సాధువు తన జోలెలోనుండి గంజాయి తీసి చిలుములో నింపి యిచ్చాడు. మహారాజు దాన్ని పీల్చారు. ఆ సాధువు కొద్దిరోజులు అక్కడ ఉండి రామేశ్వరం వెళ్లిపోయినాడు.

ఆ విధంగా అప్పటినుండి గజాననులు గంజాయిని అప్పుడప్పుడూ తీసుకుంటుండేవారు. కాని ఆ అలవాటుకు మాత్రం లొంగిపోలేదు. నిజమైన సాధువులు పద్మపత్రాలవంటి వారు కదా! తామరాకు మీద నీరు పడినా అది ఆ ఆకుకు అంటదు. సాధారణ మానవుల కోరికలవలె అటువంటి సాధువులను బాహ్యవస్తువులు చలింపజేయవు. **(సశేషం)**

# సన్న్యాసం-సజీవ విశ్వాసం



- స్వామీ సత్యానంద సరస్వతి

సన్న్యాసి అంటే కాషాయ బట్టలు, ముండిత శిరస్సు, పెరిగే గడ్డం మాత్రమే కావు. నిజమైన సన్న్యాసి అంటే బొమ్మకట్టిన త్యాగం, అచ్చమైన వైరాశ్యం, అసంగత్వం. ఆయన తపస్సుకు, పవిత్రతకు, ఆత్మ పరిశుద్ధతకు ప్రతినిధి. తమ కోసం మాత్రమే జీవించేవారు సన్న్యాసులు కాలేరు. ఒక సంస్థ సంపత్తిని తన సంతానం కోసం, తన కోసం ఉపయోగించే ధర్మకర్త ఆ సంపత్తిని దురుపయోగం చేసినట్లు. సన్న్యాసం అనే మాటకు అర్థం ఏమిటి? విశ్వాసం అని. నీ భావనలు, సమర్థతలు, తనువు, ధనం, మేధస్సు- ఇవన్నీ నీ సంపత్తి. దానికి నీవు ధర్మకర్తవు మాత్రమే. ఆ మొత్తాన్ని-అన్ని వనరులను ఇతరుల కోసమే ఉపయోగించాలి. అప్పడే నీవు సన్న్యాసివి.

సన్న్యాసానికి లక్ష్యం లేదా గమ్యం కేవలం దైవాన్ని చూడడం, వ్యక్తిగతమైన శాంతిని సాధించడం మాత్రమే కాదు. మానవాళిని ఉద్ధరించటం కూడా. ప్రపంచం అగ్నిజ్వాలల మధ్య ఉంది. నీ ఇరుగు పొరుగు వారు తగలబడిపోతుంటే నీవు హాయిగా నీ ఎయిర్‌కండిషనర్ గదిలో తాపీగా కూర్చొని ఉండగలవా? ఎంతసేపు ఉండగలవు? ఆ అగ్ని నీ ఇంటిని కూడా కబళించడానికి ఎంతో సమయం పట్టదు. అందుచేత ప్రపంచమంతటిని చల్లబరిచే ప్రయత్నం చేయాలి. విశ్వమంతటా చల్లదనం, శాంతి నెలకొని ఉన్నప్పడు అవి నీవు కూడా అనుభవించగలవు. అప్పడు నీకు ఎయిర్‌కండిషనర్‌తో ఏమి పని? సన్న్యాసి ముందర ఒక గొప్ప ఆదర్శం ఉంది. సన్న్యాసం స్వీకరించదలచిన ప్రతివారూ దీన్ని అనుసరించవలసిందే. పరులను సేవించడం, నలుగురో, ఐదుగురో ఉన్న తన కుటుంబాన్ని కాక చుట్టుప్రక్కల ఉన్నవారందరినీ తనవారిగానే భావించడం - ఇదీ ఆ ఆదర్శం.





సన్న్యాసాన్ని కెరీర్‌గా ఎవ్వరూ తీసుకోకూడదు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో- "యోగులు-సన్న్యాసమంటే కర్మఫలాన్ని ఆశించకుండా త్యాగం చెయ్యడం అని అర్థం చేసుకుంటారు" అన్నారు. కానీ సన్న్యాసం తీసుకున్న ప్రతివారూ ఈ లక్ష్యాన్ని పూర్తి చేస్తారని అనుకోలేం. దానికి కారణం వాళ్ళతోపాటు, వారి స్వీయకర్మలూ వస్తాయి. ఇంకా కొంతమంది చిన్ననాటనే వైరాగ్యంతో గురుపాదాల చెంతకు చేరుతారు. వారు చేసే గురుసేవే కర్మలకు, ప్రాపంచికమైన సుఖదుఃఖాలకు వారిని అతీతులను చేస్తుంది.

సన్న్యాసి జీవితం ఒక స్థాయిలో నిర్వహింపబడాలి. ఈ ఇరువయ్యవ శతాబ్దం ద్వితీయభాగంలో సన్న్యాసం అనేది ఒక కెరీర్‌గా, ఒక వృత్తిగా, గౌరవాదరాలను, కీర్తిప్రతిష్ఠలను, శిష్య పరంపరలను, ఒక విఖ్యాతిని పొందడానికి ఒక సాధనంగా మారిపోయింది. ఇరవై ఒకటవ శతాబ్దం మట్టుకు కొంచెం ఆశావహంగానే ఉంది.

శిరస్సును ముండనం చేసుకున్న, దీక్ష తీసుకున్న సన్న్యాసులందరు కూడా ఇది జాగ్రత్తగా వినాలి. సన్న్యాసి సంతోషానికి గుర్తుకాడు- కాలేడు కూడా. సన్న్యాసి భోక్త కాదు. కేవలం ధర్మకర్త. సన్న్యాసులు పేదవారు కాదు. ఎప్పడూ సంపన్నులే. కానీ వారి సంపత్తి వారికి చెందదు. దొరికినదంతా ఒక ట్రస్ట్ (సంస్థ)లో ఉంచుతారు. అది సమాజానిది. సమాజం యొక్క (సంపదకూ) విశ్వాసానికీ ద్రోహం చేసే హక్కు ఎవ్వరికీ లేదు.

మీరు మామిడిచెట్లు తమ పళ్ళు తాము తినడం ఎప్పడైనా చూశారా? గుమ్మడి తీగ తమ పళ్ళు తాము ఎన్నడైనా తింటుందా? "పరోపకారాయ సతాం విభూతయః" - మహనీయుల శక్తులన్నీ పరసేవ కోసమే, పరుల ప్రయోజనం కోసమే. సన్న్యాసులు పరుల కోసమే జీవం చాలనేది ఒక శాశ్వత ధర్మం. వారు ఆధ్యాత్మిక జీవనం గురించి బోధిస్తున్నా, సామాజిక సేవ చేస్తున్నా వారు ఇతరుల కోసమే జీవిస్తారు. కొందరు గృహస్థులు,

సమాజానికి ఏదో కొంత చేస్తుండవచ్చు. కాని తమ కోసం తామే జీవిస్తారు గృహస్థులు. వారి భాగస్వామ్యాన్ని తక్కువగా అంచనా కట్టగూడదు. కాని వారు సన్న్యాసులలాగ కేవలం పరుల కోసమే జీవించరు.

నేడు సన్న్యాసుల పాత్ర ఏమిటి? పరోపకారం అన్నది వేరువేరు కాలాలలో వేరువేరు అర్థాలను ఇచ్చింది. ఒకప్పుడు ఇది ఇతరులకు శాంతి నివ్వడం, ప్రవచనం, మంత్రాలు, పూజావిధానాలు, ఆసన ప్రాణాయామాలు ఇవన్నీ నేర్పడమే సన్న్యాసి ధర్మంగా భావింపబడింది. కానీ పేదరికం విపరీతంగా పెరిగిపోతున్న వేళ, ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడమే పరోపకారంగా భావించబడవచ్చు.


పారిశ్రామిక విప్లవం ప్రారంభమయ్యాక నిరుద్యోగం స్థాయి పెరిగింది. రాజకీయ అల్లకల్లోలాలు పెరిగాయి. యావత్ప్రపంచ చరిత్రలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితులలో సన్న్యాసి ధర్మం మారుతుంటుంది. వారప్పుడు గ్రామాలలో పనిచేయవలసి వస్తుంది. నగరాలలో పెద్దపెద్ద ఆసుపత్రులకు, పాఠశాలలకు ఏమీ కొరత లేదు. కొన్ని భారతీయ గ్రామాలు ఎటువంటి సౌకర్యాలకూ నోచుకోలేదు. సన్న్యాసులు నగరాలను విడిచి దూరతీరాలలోని కుగ్రామాలకు వెళ్ళాలి. అక్కడ కుటీరాలను నిర్మించుకోవాలి.

సన్న్యాసి అందరినీ సేవించాలి. ఏ భేదం ఉండకూడదు. కాలం మారిపోయింది. సన్న్యాసుల ముందు ఒక పెద్దసవాలు ఉంది ఇప్పుడు. రాజకీయ నాయకులు దేశాన్ని మోసగించారు. సన్న్యాసులెప్పుడు మోసగించకూడదు. బ్రాహ్మణులు, మేధావులు ఈనాడు జాతిని పరిపాలించలేరు. ఆయుధధారులైన క్షత్రియులూ పరిపాలించలేరు. ఇప్పుడు ప్రపంచాన్ని శాసించేవి ఆర్థిక, కార్మిక వర్గాలు. అందుచేత మనలోని ప్రతివారూ కూడా ఈ తరంలో సన్న్యాసికి ఒక ప్రత్యేకమైన బాధ్యత ఉన్నదని గుర్తుంచుకోవాలి. ఇప్పుడు సమాజంలోని మిక్కిలి బలమైన





విభాగం సన్న్యాసులదే. ఒక డిప్యూటీ కమీషనర్‌గానీ ఒక పోలీసు సర్వాధికారి గానీ నిర్వహించలేని పంచాయితీని ఒక్క సన్న్యాసే నిర్వహించగలడు. ఒక దేశాధిపతి అధికారం-రాజదండం. సమాజాన్ని సరిదిద్దలేనప్పుడు యోగ దండం (యోగశక్తి) ఆ పనిని సాధించగలదు. సన్న్యాసులు మకుటాలు లేని మహా చక్రవర్తులు. వాళ్ళు సమాజాభివృద్ధి కోసం తమను తాము అంకితం చేసుకోవలసిందే. అదే జరగనినాడు సమాజంలో చెలరేగిన అలక్షిత జాతి పరిపాలకులను, సన్న్యాసులను కూడా నిలువనివ్వదు. నాశనం చేస్తుంది. ఇది నిజం.



# అసలు కథ

– (ఓషో ఉపనిషత్తు నుండి)

ఒక శిష్యుడు ఓషో (స్వామీ రజనీష్)ను ఇలా అడిగాడు- "మీ చుట్టూ ఉన్న రకరకాల స్థానాలలో మీరు నెలకొల్పిన మనుష్యులు, ఆ మేనేజ్‌మెంటు-ఇవన్నీ నాకు చికాకునీ, వ్యతిరేకతనీ కలిగిస్తాయి. ఎందుకని?" దానికి ఓషో యిలా జవాబిచ్చారు -

"చాలా తేలిక దీనికి సమాధానం. ఇక్కడ ఏదో ఒక అధికార స్థాయిలో ఉండి పెత్తనం చేయాలని నీకున్నది. అందుకే నీలో ఆ వ్యతిరిక్తత వస్తోంది. నీవు వినయశీలివి కావు. నీవిక్కడికి వచ్చింది ధ్యానం కోసం కాదు. అధికారం కోసం ఆరాటపడే తత్వం నీది. ఇప్పటికీ ఆ విషయం గ్రహించ లేకపోతే నీవు గుడ్డివాడివన్నమాటే.

ప్రతి దానికీ ఏదో ఒక కార్య నిర్వహణ యంత్రాంగం అవసరం. ఓ వెయ్యి మంది జనం యిక్కడికి వచ్చారనుకో-వారిని ఆదరించటానికో, అదిలించడానికో ఏదో ఒక నిర్వాహక యంత్రాంగం అవసరం. చూచే వాళ్లకు వాళ్లేదో అధికారంలో ఉన్నట్లు, పెత్తనం చేస్తున్నట్లూ కనిపిస్తుంది.

కానీ అది కేవలం పనిచేయడానికే-తాత్కాలిక అవసరార్థం ఉపయుక్తమయ్యేదే. నీవు దాన్ని వ్యతిరేకిస్తున్నావు.

నీవు నిర్వాహక వర్గంలోకి వస్తావనుకో-ఇతరులు నిన్ను అలాగే వ్యతిరేకిస్తారు. ప్రతి వారినీ మేనేజ్‌మెంట్‌లోకి తెస్తే వాళ్లు ఎవరిని మేనేజ్ చేస్తారు? అందుచేత యీ మూఢత్వం వదిలిపెట్టు. ఇక్కడ పనులు నిర్వహిస్తున్న వాళ్లంతా లక్షణంగా నిర్వహిస్తున్నారు. వినీతభావంతో, నిరాడంబర భావంతో పనిచేస్తున్నారు. ఎవ్వరూ అహంకారంతోగానీ, ఇతరులను అణగదొక్కాలనిగానీ ప్రవర్తించటం లేదు. కానీ కొన్నిసార్లు మీరేదైనా చేయాలనుకొన్నపుడు "అలా చేయటం కుదరదు" అని మీకు గట్టిగా తెలియజేయవలసి ఉంటుంది. అది మీకు నచ్చదు.

ఒకసారి నేను ఏథెన్స్‌లో ఒక పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొనవలసి వచ్చింది. అక్కడ నలభైమంది పోలీసు ఆఫీసర్లున్నారు. నేను "ఇది పోలీసు కాన్ఫరెన్సా? ఎవరితో మాట్లాడలిప్పుడు నేను?" అని అడిగాను. అసలు నేనప్పుడు మాట్లాడవలసిందే పోలీసు వారికి వ్యతిరేకంగా. చుట్టూ వారే కుప్పతిప్పలుగా ఉంటే ఏం మాట్లాడగలను?

అప్పుడక్కడ సరైన నిర్వహణ చేసేవారు లేకపోతే సి.ఐ.డి. ఆఫీసర్లు, పోలీసాఫీసర్లతో హాలు నిండిపోయి, నేనేం చెప్పేదీ వాళ్లకు అనవసరం గనుక-నా శ్రమ, సమయం అన్నీ వృథా అయిపోయేవి. వాళ్ల సమయమూ వృథాయే. కాబట్టి ఎంతమంది పోలీసులను లోలికి రానివ్వాలో నిర్ణయించి క్రమపరిచే వ్యవస్థ అక్కడ ఉండితీరాలి. వారిలో అతి కొద్దిమందినే అక్కడ ఉండనివ్వాలి. విలేఖరులకు తగినంత అనుకూల వాతావరణం ఏర్పరచాలి. అలా కాకపోతే పని సవ్యంగా జరిగేదెలాగ?

అందుచేత నీ ప్రశ్న తప్పు. దానివెనుక నీ అహంభావం ఉంది. దాన్ని వదిలెయ్యి. ఇందులో చర్చించడానికేమీ లేదు - వదిలెయ్యి-అంతే!





# మాతృసంస్థ కబుర్లు

నేను కోదండ రామసాయిని. "పరమేశ్వరుడు మృత్యుంజయుడు. అలాగే సాయినాథులు కూడా మృత్యువును జయించారు. ఆ సంగతి మనకు తెలిసినాగానీ పెద్దగా పట్టించుకోము. మృత్యువును జయించిన స్వామి మనకు తోడుగా ఉన్నారన్న సంగతి మనసుకుపడితే మనవాళ్లు ప్రక్కచూపులు చూడవలసిన పనే ఉండదు గదా! అంచేత మనం యీసారి దత్తపూర్ణిమనాటి రాత్రి నుండీ ప్రారంభించి అవిశ్రాంతంగా నామ సంకీర్తనం, భజనలు జరపాలి. మూడవనాడు స్వామి పునరుత్థానం చెందడాన్ని ఉత్సవరూపంలో ప్రదర్శించాలి. ఈ మూడురోజులపాటు పరిసర గ్రామాలలోని భజన సమాజాలు, సాయిధామవాసులు, వచ్చిపోయే భక్తులు-అందరూ భాగస్వామ్యం వహించి ఉత్సవం సుసంపన్నం చేయాలి"-అమ్మ (మాతాజీగారు) నన్ను కూర్చోబెట్టి చెప్పారు డిసెంబరు 5వ తేదీన. ఆ తరువాత మా ఆశ్రమంలోని యువకార్యకర్తలందరికీ యిదే విషయం వివరించారు.

మరునాడే కరపత్రం వ్రాసిచ్చారు. డి.టి.పి, ప్రింటింగు అంతా ఆ రోజే అయిపోయాయి. ఎనిమిదవ తేదీ నుండీ నేను, మా పాఠశాల ఉపాధ్యాయులు నరేశ్, శ్రీనివాస్ గ్రామాల వెంట వెళ్లి యీ ఉత్సవవిషయం వివరించి, భజనలు చేయటానికి రావలసిందిగా ఆహ్వానించి వచ్చాము. పదవ తేదీకి ఆ పని పూర్తయింది. మరో మూడు రోజుల తరువాత ఆయా గ్రామాల వారు (భజన వారు) సాయిధామంలో సమావేశమైనారు. మాతాజీ వారందరికీ విషయం చెప్పి, భజన, నామం కలిపి చేస్తే బావుంటుందనీ-పగలంతా నామం, రాత్రి భజన అయితే భక్తులు నిద్రావశులు కాకుండా ఉంటారనుకొంటున్నామనీ- మూడేసి గంటలు ఒక్క గ్రామం చొప్పన పంచుకోవాలనీ వివరించారు. ఉద్దమర్రి భక్తులు స్వామి వారి

ఆశీస్సులతో చాలాకాలం నిర్విఘ్నంగా సాగిన తమ భజన మండలి కొంతకాలంగా నీరసించిపోయిందనీ, ఈ కార్యక్రమం వలన తిరిగి చైతన్యవంతమవుతుందనీ, సాయిప్రభుని కరుణ తమ మీద తిరిగి వర్షిస్తుందని విశ్వసిస్తున్నామనీ కన్నీటి పర్యంతమవుతూ అన్నారు. మొత్తం మూడు రోజులూ తాము ఇక్కడే ఉంటామని మాట ఇచ్చారు. మిగిలిన వారందరూ కూడా తమ అంగీకారాన్ని సోత్సాహంగా తెలియజేసారు. ఏరోజు ఏ ఊరివారు ఏ టైమింగ్స్‌లో రావాలో లిస్ట్ వ్రాసారు. ప్రసాద స్వీకారం చేసి వారంతా వెళ్లిపోయారు.

13వ తేదీనుంచీ సరుకులు, కుర్చీలు కొనటం వగైరావగైరా పనులు ప్రారంభమైనాయి. కానీ, అమ్మకు జ్వరం పెద్దపెట్టున రావటంతో కొద్దిగా నిరాశగా అనిపించింది. ఆ జ్వరం 15వ తేదీకి విపరీతంగా పెరిగి పోయింది. ఆ రాత్రే ఆమెను హాస్పిటల్లో చేర్చవలసి వచ్చింది - రాత్రి పది గంటల వేళ. మరునాడే దత్తపూర్ణిమ. నాకు కాళ్లూ, చేతులూ ఆడటం లేదు. పదహారవ తేదీన మాతాజీ అందరినీ హాస్పిటల్ నుంచీ వెళ్లిపొమ్మ న్నారు. "ఏ ఒక్క వ్యక్తి కోసమూ సంస్థ పని ఆగిపోకూడదు వెళ్లండి- కార్య క్రమం చక్కగా సాగేలాగా చూడండి" అంటూ తొందరచేసారు. ఆమె పరిస్థితి చూస్తే రావాలని లేదు. కానీ, తప్పక కదిలాము. ఆ రాత్రి పదిన్నర గంటలవేళ శ్రీ సాయి మహల్సాపతికి చెప్పి తన ప్రాణాలు వెలికితీసుకు వెళ్లిన అధ్యాయం చదివాము. గురుదేవులు లఘుప్రసంగం చేసి "ఓం సాయిరామ్ శ్రీ సాయిరాం జయజయ సాయిరాం జయ సాయిరాం" అని నామం ప్రారంభించారు. ఆశ్రమ బాలలు, పెద్దలు, గ్రామాల నుండీ వచ్చిన భజన మండలుల వారు కలిసి కొంతసేపు నామం పలికి, భజనలు అందుకొన్నారు. ఆ రాత్రి బొమ్మలరామారం, మూడుచింతలపల్లి గ్రామాల వారు శ్రుతిపక్వంగా, భక్తిప్రపత్తులతో భజనలు చేసారు.

17వ తేదీ ఉదయం 6 గం. ఆశ్రమ బాలలు నామం అందుకున్నారు. ఆ పగలంతా శ్రీ సాయీ విద్యాధామం బాలబాలికలు విడతలవారీగా





నామసంకీర్తనం చేసారు. తరువాత ప్రశాంతి, సంధ్యలలోని వృద్ధులు, ఉష భవనంలోని బాలబాలికలు దానిని కొనసాగిస్తుండగా రాత్రి 8.30 గం.లు అయ్యింది.

ఆ రాత్రి హాజీపురం గ్రామవాసులు, కీసర, మల్యాల గ్రామాలలోని భక్తులు కలిసి మనోహరంగా సాయి స్తోత్రగానం చేసారు. నేను హాస్పిటల్‌కూ, ఆశ్రమానికీ మధ్య తిరుగుతూనే ఉన్నాను. అమ్మను చూచివచ్చాక కలిగే బాధను గురుదేవుల పాదనమస్కారం చేసి పోగొట్టుకుంటున్నాము. గురు దేవులు కూడా కొంచెం నలుగుతున్నారు భక్తులు ఎక్కువగా రావటంతో.

18వ తేదీ ఉదయం ప్రశాంతివాసులు ఒకరిద్దరు నామం అందు కోగా-ఆశ్రమబాలలు అందులో వచ్చి కలిసారు. వచ్చిపోయే భక్తులు, ఆశ్రమ వాసులు అంతా కలిసి రాత్రి 9 గం.ల వరకు భక్తిప్రపత్తులతో నామసంకీర్తనం చేసారు. మరోప్రక్క విష్ణుసహస్ర నామం, చాలీసా పారాయణమూ జరుగుతున్నాయి. ఆ రాత్రి ఫకీరుగూడెం, కేశవపురం, ఉద్దమర్రి గ్రామాలలోని భక్తులు వీనులవిందుగా, సాయినాథుడే తలఊపేలాగా సాయిభజన, నామం రెండు వినిపించారు.

తెల్లవారుజామున రెండున్నర గంటలకు అమ్మ దగ్గరి నుంచీ ఫోన్ వచ్చింది-"నాకు బాబాగారు ఒక సందేశమిచ్చారు. తెల్లవారేప్పటికి నీవు వచ్చి నన్ను తీసుకువెళ్లాలి-లేదా నేనే వచ్చేస్తాను" అని. ఆమె పట్టుదల నాకు తెలుసు. ఐదుగంటలకల్లా కారు తీసుకొని హాస్పిటల్‌కు వెళ్లాను. పాలిపోయిన ముఖంతో, నీరసించిన కంఠంతో అమ్మ సిద్ధంగా ఉంది నాకోసం. అప్పటికే డాక్టరుగారి అనుమతి తీసుకున్నది. ఆశ్రమానికి చేరుకొంటూనే గురుదేవులకు నమస్కారం చేసి, పిల్లలందరినీ దగ్గరకు చేర్చుకొన్నది. అమ్మ.

✡ ✡ ✡

నేను మాతాజీని. 15వ తేదీ రాత్రి నుండీ నాకు కంటిమీద కునుకు లేదు. ఏదో తెలియని ఆరాటం. మందుల దారి మందులదే. ఆ ఆరాటం

16వ తేదీ రాత్రికి పెరిగిపోయింది. కళ్ల ఎదుట ఏవేవో దృశ్యాలు. అన్నీ బాబాకు చెందినవే. ఎక్కడినుంచో భజనలు విన్పిస్తున్నాయి లీలగా. ప్రక్కనున్న గీతను అడిగితే-తనకేమీ వినపడటం లేదన్నది. మరి నాకెలా విన్పిస్తున్నాయి? నా మనసు చేసే గారడీనా? నాకేమైనా మతి చలిస్తోందా? 17 మొత్తం అదే పరిస్థితి. సాయిదర్బార్‌లోనే ఉన్నాను పూర్తిగా. రాత్రి రెండు గంటలైంది. హఠాత్తుగా నాలోపల ఏదో స్ఫురణ. అవును-అదే నిజం. ఎప్పుడు ఏ కార్యక్రమం మొదలుపెట్టినా ఆశ్రమ ధర్మాధికారిణిగా నా ధ్యాస అంతా ఆ కార్యక్రమం ఎలా సక్రమంగా జరిపించాలా అన్న దాని మీదనే ఉంటుంది. ఆహ్వానాల మొదలు వంటకాల వరకు అన్నింటితోనూ సతమత మవుతూ ఉండవలసి వస్తుంది. సాయిని మనసారా, ఏకధ్యానంతో చూడటం-ఆ కార్యక్రమ ఫలితాన్ని పరిపూర్ణంగా, ఆనందంగా అనుభ వించటం కుదరదు. ఇప్పుడు-ఈ కార్యక్రమం సాయి నాకిచ్చిన సంకల్పం. ఇలాటిది ఆశ్రమంలో మునుపెన్నడూ జరగలేదు. మరెక్కడా చూడలేదు కూడా. అంచేత సాయి తాను తనువు వదిలివెళ్లేవేళకు నన్ను కూడా యిక్కడ పడుకోబెట్టేసాడు. ఆయన తప్ప మరో ధ్యాస లేకుండా-నిద్రా హారాలు కూడా లేని ధ్యానస్థితిలో ఉంచాడు. ఆయన తిరిగిలేచే వేళకు నేను కూడా అక్కడికి-స్వామి శయనించి ఉన్నచోటికి వెళ్లాలి. ఆ మహదా నందంతో పాలుపంచుకోవాలి. ఇదీ సాయి ఇచ్చే ఆదేశమే. వెంటనే రాముకు ఫోన్ చేసాను. తెల్లవారేటప్పటికి ఆశ్రమానికి బయలుదేరాను.

గురుదేవులకు నమస్కారం చేసుకొని, పిల్లలందరినీ పోగుచేసుకుని, ఎవరేం చేయాలో-ఏం పాట పాడాలో చెప్పాను. అప్పుడు కాస్సేపు నిద్రపోయాను. నిద్రలో ఏదో సంగీతం ....

✡ ✡ ✡

మళ్లీ రామునే. 'కళ్యాణి'లో వేదిక మీద సాయి పవళించి ఉన్నారు. హాలు సగానికిపైగా భక్తులతో నిండిపోయింది. సాయి చుట్టూ ఆశ్రమం పిల్లలంతా చేరారు. కొందరు మరాఠీవేషాలలో, కొందరు మామూలుగా.





తల్లీ తండ్రీ లేని పిల్లలమైనాము అంటూ జాలి జాలువారేలాగా పాడారు. "సాయి దేవదేవా యికనైన తిరిగి రావా!" అని మంజుల ఆలపించింది ఆరాటంగా. అంతలో బైజాబాయిగా పదకొండేళ్ల అమ్మలు వచ్చింది నివేదనతో. "ఆకలితో ఉంటావని నేను రొట్టెలు చేసి తెస్తే యిలా పడుకొన్నావేమిటి బాబా! తమ్ముడూ అని పిలవగానే అక్కా అంటూ పలుకుతావుగదా! లే బాబా!" అంటూనే భావోద్వేగంతో పెద్దగా ఏడ్చేసింది అమ్మలు. హాలులో సగంమందికి కన్నీళ్లు వచ్చాయి. "గోళీలు తెచ్చాను మామా! లే ఆడుకొందాం" అని వెంకట్ (ఏడేండ్లు) మారాం చేస్తోంటే-తలో రీతిగా బ్రతిమాలారు బాబాను లెమ్మని. అంతలో డాక్టర్ (జ్ఞానేశ్వర్) వచ్చి పరీక్ష చేసి బాబా మరణించాడనీ, శవాన్ని అలా ఉంచ రాదనీ అన్నాడు. నానావలీ (నందు) మండిపడ్డాడు. "బాబా చచ్చిపోవడం ఏమిటిరా?" అని. వెంటనే మహల్సాపతి (వాసు) "నీవు ఇచ్చిన మంత్రమే నీ మీద ప్రయోగిస్తాం చూడు" అంటూ విభూతి గుప్పెళ్లతో చల్లసాగాడు బాబాపై. అలా అందరూ విభూతి చల్లుతూ "అందరమిక్కడ నీకై నిలిచేమూ-అన్ని గొంతులూ ఒకటిగ పిలిచేమూ-నువ్వు వచ్చే తీరాలయ్యా సాయీ, దరిశన మిచ్చే తీరాలయ్యా-వచ్చే తీరాలయ్యా-నువు వచ్చే తీరాలయ్యా" అని ఖంగున పాడసాగారు. వంశీ రామానుజం సాంబ్రాణిధూపం వేసారు. పాట తారాస్థాయికి వెళ్లింది. మరుక్షణంలో శ్రీ సాయినాధులవారు కూర్చొని దర్శనమిచ్చారు. భక్తులంతా సమర్థ సద్గురు సాయినాథ్ మహారాజుకూ జై అంటూ హర్షధ్వానాలు చేసారు. పిల్లలు ఆనందోత్సాహాలతో కోలాటం చేస్తూ పాటలు పాడారు.

అటుపైన అమ్మ తన అనుభూతిని అందరితో పంచుకోవాలను కొన్నారు. చాలా నీరసంగా ఉండటంతో గురువుగారు వారించబోయారు గానీ, ఆమె వారికి నమస్కరించి అనుమతి అడిగితే కాదనలేకపోయారు. ఆమె తమ అనుభవాలనూ, సాయి తమకిచ్చిన భాగ్యాన్నీ మధ్యమధ్య అలసటతో ఆగిపోతూనే వివరించారు.

అటుపైన నేను కూడా ఒక్కనిమిషం మాట్లాడాను. ఆ తరువాత సాయికి హారతి జరిగింది. గొప్ప భక్తులు, ఒక సంస్థ యజమాని, నిరాడంబరులు నాయర్‌గారు దగ్గర వుండి చేయించిన కమ్మని వంటకాలతో అన్నప్రసాద వితరణ జరిగింది. గురుదేవులు భజనలలో పాల్గొన్న గ్రామీణులందరినీ సమావేశపరచి అభినందించి, చక్కని పుస్తకాలను, సాయి చిత్రపటాలను జ్ఞాపికలుగా అందజేసారు ఆశీఃపూర్వకంగా. భక్తులంతా భోజనాలకు లేవగానే అమ్మ వెళ్లిపోయి పడుకొన్నది. అందరూ వెళ్లిపోయాక ఆమె దగ్గరకు వెళ్లాను. దగ్గరకు పిలిచి, నా భుజం మీద తట్టారు. తలనిమిరి, "బాగా నిర్వహించావు బాబూ! నాకూ, పనికీ మధ్య హైరాణా పడ్డావు. అయినా బాధను అతిక్రమించి స్థిరంగా పనిపూర్తి చేసావు. గుడ్!" అన్నారు. నా కళ్లు నీళ్లతో నిండిపోయాయి. ఇది నా ఘనతా? గురుదేవుల ఆశీఃఫలమా? మాతాజీ కార్యదీక్షా ఫలితమా? అవి రెండూ లేనిదే నేనెక్కడ? శ్రీ సాయికి మనసులోనే నమస్కరించుకొన్నాను.

✡ ✡ ✡

ఈ కార్యక్రమానికి వంటపాత్రలు ఉచితంగా అందించిన బొమ్మల రామవరం శ్రీ భాస్కర్‌గారికి, 19వ తేదీనాడు తప్పెట తాళాలతో తరలివచ్చి ప్రత్యేకాకర్షణగా నిలచి, పల్లకీసేవలో పాల్గొన్న రామారం అయ్యప్పదీక్షా పరులు విశేషంగా అభినందనీయులు. చలికి ఓర్చి తెల్లవార్లూ మెలకువగా ఉండి చక్కని భజనలు చెప్పిన అన్నిగ్రామాలవారూ ప్రశంసనీయులే. ముఖ్యంగా మూడురాత్రులూ మాతో ఉండి, 19వ తేదీ ఉదయం ప్రత్యేకంగా వీనులవిందైన పాటలు వినిపించి 'మేము మీవారమే' అన్న భరోసా కలిగించిన ఉద్దమర్రి గ్రామ మిత్రులకు కృతజ్ఞతలు.

కార్యక్రమం అనుకోగానే తమకు తామై రంగప్రవేశం చేసి మొత్తం అన్నదానం ఖర్చు పెట్టుకోవటంతోపాటు గరిటెపట్టి నిలబడిన మాన్యమిత్రులు శ్రీ అరవిందాక్షన్ నాయర్‌గారికి ఆశ్రమం తరఫున





కృతజ్ఞతలు. అమ్మ అనారోగ్యానికీ, కార్యక్రమాలకూ మధ్య ఆసులో దారంలాగా తిరుగుతూ నేను గుడివైపు తొంగైనా చూడలేకపోయినా గుడి మొత్తం భారం తామే మోసిన శ్రీ గోవిందరావు తాతయ్యకు నా నమస్సులు. ఇందరినీ గుర్తుపెట్టుకొని నా సోదరులను మర్చిపోతే ఎలాగ! అర్ధరాత్రులలో భజన భక్తులకు ప్రసాదాలు చేసీ, తెల్లవారుజామున లేచి హాస్పిటల్‌కు కేరియర్లు, బట్టలు సర్ది నాకు అందించీ, వేళాపాళా లేకుండా వచ్చే నాకు ఆదరంతో అన్నంపెట్టీ, చెప్పిన పనల్లా చకచక చేసీ, కళ్యాణిని శుభ్రం చేసీ, చివరికి గిన్నెలు తోమీ-అన్నిరీతులా తోడై నిలిచిన నా తమ్ముళ్లూ, నా చెల్లెళ్లకు నేనేమివ్వగలను-ప్రేమార్ద్రమైన ఆశీస్సులు తప్ప!

## ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము

"దివ్య జీవనసంఘము"నకు చెందిన "యోగ వేదాంత ఫారెస్టు అకాడమీ" 76వ యోగ వేదాంత తరగతులను 1-3-2014 నుండి 29-4-2014వ తేదీ వరకు రెండు మాసముల కొఱకు నిర్వహింపనున్నది. ఈ తరగతులు ఋషీకేశ్, శ్రీ శివానందశ్రమ ప్రాంగణమునందు జరుగును. 20 నుండి 65 సంవత్సరముల మధ్య వయస్సు గల భారతీయ పురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహింపబడును. ఈ తరగతులు ఆంగ్లభాష యందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్లభాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసి యుండవలెను. శిక్షణ, వసతి, భోజనములు ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరి తేదీ 20-1-2014. ఈ క్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికలను పొందవచ్చును. అంతేకాకుండా www.sivananda online: Yvfa@website నుండి కూడా పొందవచ్చును. e-mail yvfa@dishq org మరియు Yvfacedemy@gmail.com.

**చిరునామా : రిజిస్ట్రార్, యోగ వేదాంత ఫారెస్ట్ అకాడమీ, శివానంద నగర్-249192, టెహ్రీ గర్వాల్ జిల్లా, ఉత్తరాఖండ్**